

# చీమలపుట్టలు

ఎ.యం. అయోధ్యారెడ్డి

సాయంత్రం మూడున్నర గంటలైనా ఆ థియేటర్లో సినిమా యింకా మొదలెట్టలేదు.

బయట లౌడ్ స్పీకర్లో పాటమాత్రం చెవులు చిల్లులు పడేలా వినిపిస్తోంది. థియేటర్ ఆవరణలోకి జనం..., వర్షం వెలిశాక చూరులోంచి కారే వర్షపు చినుకుల్లా ఒక్కొక్కరే చేరుకొంటున్నారు.

ఆ థియేటర్ ఆనవాయితీ ప్రకారం జనం చాలినంత రానిదే సినిమా మొదలెట్టడానికి వీల్లేదు.

మేనేజర్ పరమేశ్వరయ్య బయట వరండామీద కొచ్చాడు. ఒక్క నిముషం పబ్లిక్ కేసి పరిశీలనగా చూసి తిరిగి లోపలకు పోయాడు. అలా అతను వొచ్చి పోవడం అది మూడవసారి.

బయటున్న జనం అతనికి తృప్తి కల్గించలేదేమో సినిమా మొదలెట్టే ఉద్దేశం లేనట్లుగా తిరిగి కుర్చీలో కూర్చుండిపోయాడు.

ఒకవేళ జనం మరో గంటసేపటి వరకైనా సంతృప్తి కల్గించేటంతగా రాగల్గితే అతను ఐదు గంటలకి సినిమా ప్రారంభిస్తాడు. ఇంక అదే మాట్నీ!

---

చీమలు పెట్టిన పుట్టల్లో పాములు చేరుకుంటాయి. రెండు పిల్లులు రొట్టెముక్కకోసం కాట్లాడుకుంటే, మధ్య మధ్యవర్తి అయిన కోతి కొట్టేస్తుంది. ఈ నీతి కథలు మీకు తెలుసు. అయితే యీ కథ చదివి ఆ రెండిట్లో దేనికి సరిపోతుందో చెప్పుకోండి!

అదే ఫస్టు షోగా చలామణి అవుతుంది.

ఆ వూళ్లో వున్నది ఇదొక్కటే థియేటర్. ఇదివరకే సగం కూలిపోయున్న గోడల్ని బాగుచేయించి అందులో సింగిల్ ప్రొజెక్టర్ సినిమా థియేటర్ ప్రారంభించాడు ప్రొప్రయిటర్ కమ్ మేనేజర్ పరమేశ్వరయ్య.

ఆ టాకీసుకి అన్ని క్లాసులూ వున్నయ్. కాని, ఫస్టు నుంచి లాస్టు క్లాసు వరకూ ఏ ఎంట్రెన్స్‌కీ తలుపుల్లేవు. ఎప్పటివో రంగు మాసిన కర్టెన్లు మాత్రంవుండి. లేనట్లుగా వ్రేలాడుతున్నాయ్.

కాంపౌండ్‌లో జాగా విశాలంగా వుంది. ఆ కాంపౌండ్‌లో ఓ కిల్లీకొట్టు. సోడా బడ్డీ పక్క పక్కనే వున్నాయి. వాటి కెదురుగా ఒకదాని పక్కన మరోటిగా చిన్న తడకల్తో రెండు మిరపకాయ బజ్జీల దుకాణాలు.

అందులో మొట్ట మొదటి దుకాణం నరసమ్మది. థియేటర్‌లో పబ్లిక్ హౌస్ ఫుల్‌గా వున్నా, లేకపోయినా నరసమ్మకి గిరాకీ మాత్రం హౌస్‌ఫుల్‌గా వుంటుంది.

నరసమ్మది స్థూలకాయం. శరీరం మరీ చూడటానికి ఎబ్బెట్టు కల్గించే రీతిలో పెరిగిపోలేదు. కాని అవయవాలన్నీ మోతాదు మించి మనిషి బొద్దుగా వుంటుంది. ముఖం చూడగానే గుమ్మడి పండు గుర్తుకొస్తుంది. నొసట రూపాయి కాసంత కుంకం బొట్టుతో ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతుంది. మూకుటి ముందు నుంచి లేవకుండానే అన్ని పన్లూ చక్కబెడుతుంది.

రుచికరమైన మిరపకాయ బజ్జీల తయారీలో నరసమ్మది అందెవేసిన చెయ్యి. ఆమె కొట్లో ఒక్కసారి తిన్న వాళ్ళు మళ్ళీ మళ్ళీ తినాల్సిందే.

సినిమా చూట్టానికొచ్చినవాళ్ళే కాకుండా బయటి వాళ్ళు కూడా వొచ్చి నరసమ్మ దగ్గర తినిపోతుంటారు.

ఐతే ఇదంతా మొన్న మొన్నటివరకు మాత్రమే! ఈ రోజు మాత్రం అట్లా కాదు.

ఎందుక్కాదూ అంటే ఆమె దుకాణానికి మరోటి పోటీకొచ్చింది.

ఇరవై రోజుల క్రితం ఒకనాడు లచ్చిమి ఏడుస్తూ నరసమ్మ దగ్గర కొచ్చింది. లచ్చిమితో నరసమ్మకి బంధుత్వం లాంటిదేమీలేదు. స్నేహం కూడా అంత్లేదు. నరసమ్మ వుండే పేటలోనే లచ్చిమి కూడా వుంటుంది. ఏదో ఇరుగుపొరుగు - అంతే....!


లచ్చిమి మొగుడు రిక్షా తోలుతాడు. ముగ్గురు పిల్లలు. మొగుడు పక్కా తాగుబోతు. తన కష్టం లోంచి పెళ్ళాని కేం ఇవ్వడు. ఏం చేసినా, ఎలా చేసినా అంతా లచ్చిమిదే బాధ్యత.

అలాటి లచ్చిమి ఆవేళ భోరున ఏడుస్తూ - తన మొగుడు పక్క గుడిసెలో వుండే జోగులు పెళ్ళాం రత్తితో ఎటో చెప్పా. చెయ్యక పారిపోయాడనీ చెప్పి బావురుమంది.

నరసమ్మ చాలా బాధపడి.. ఎంతగానో జాలి చూపించింది. "గా రత్తి ముండ మీన.. నా కెప్పటి సందో అనుమానంగనే వున్నది. గా అనుమానమె నిజమాయె..! గదే మోగని తాగుబోతు సచ్చినోడు నిన్ను నట్టేట్ల ముంచిపాయె గద బిడ్డ....? ఆఁ! పోతె పోయిండులె..ఆడు నిన్నెప్పుడు సరింగ జూశిండు గనక, వూకుండు! ఏడ్వకు" అని లచ్చిమి నోదార్చి. నాలుగు మిరపకాయ బజ్జీలు ప్లేటులో పెట్టి అందిస్తూ "ఇగ గిప్పుడేం జేస్తవే మొద్దు మొఖమా!" అనడిగింది ఆప్యాయంగా.

ఆ ఆప్యాయతక్కరిగిపోయి మళ్ళీ వోసారి బావురుమనేడ్చి "అక్కా! నాకు నువ్వే దిక్కు. నా కేదన్న మారుగాం సూపెట్టి.... పుణ్ణెం జేసుకో. నా పోరగాండ్లు నీ పేరు జెప్పుకొని బతుక్కతరు. గీడ నీ పక్కపొంటనే ఏదో శిన్నంగ ఓ కొట్టు దెర్సుకుంట. కాళ్ల మొక్కుత" అన్నది!

దానికి నరసమ్మ రెండు నిముషాలు దీర్ఘంగా యోచించింది. "ఇదిగాని కొట్టు తెరుస్తే తన లాభాలు తగ్గిపోతాయేమో!" అనుకొంది ముందు.




ఆ తర్వాత తేలిగ్గా చప్పరించేసింది—

'ఆఁ! దీని మొఖం .... సూత్తుంటే నోట్లె నాలికనే లేనట్టుగుంది. గిది నా బేరాణ్ణి పడగొడ్తాది..? ఏదో గింత పొట్టనిండితే.. గదే భాగ్గమని పడుంటుందిలే....!!' అనుకొని.... తనే స్వయంగా పూనుకొని లచ్చిమిని మేనేజరు బాబుకి పరిచయం చేసింది.

లచ్చిమిని ఆ బాబు కాళ్ళమీద పడవేసి అతని మనసు కరిగిపోయేలా మాటలు చెప్పి. లచ్చిమి దైన్యస్థితిని వర్ణించింది. "బాపూఁ..! తవాఁరి కాంపౌండ్లనే ఏదో సిన్నంగ కొట్టు దెర్సుకొంటదట. కాదనకొండి. బాపూ.ఁ! దయ సూపిచ్చుండి—" అన్చెప్పి ఎట్లాగైతేనేం మేనేజరు మనసు కరిగించేసి కొట్టు తెర్చేలా చేసింది నరసమ్మ.. లచ్చిమికి.

నరసమ్మ ఔదార్యానికి లచ్చిమెంతో యిదైపోయి 'రోజూ నరసమ్మ పేరుతో గుడిసెలో దీపం పెట్టుకొంటాననీ....ఇక నుంచి తనే మాకు పెద్ద దిక్కనీ. యింకా నా పాలిట, నా పోరగాండ్ల పాలిట దేవతవని కూడా చాలాసేపు పొగిడింది,

నరసమ్మ స్థూలకాయం దానికెంతగానో పొంగిపోయి."ఆఁ. పోయె ఎర్రిమొగమా నేనేం జేసినాను గనక? డబ్బిచ్చిన్నా. కొట్టు కోసురం జాగిచ్చిన్నా? ఏదో మాట సాయం జేసిన గంతనేగా?" అన్నా విన్పించుకోకుండా లచ్చిమి, "అక్కా! నువు నువొద్దనే మా అక్కవ్! నా పోరగాండ్లకు పెద్దమ్మవ్!! నా ఇంటికి నువ్వే పెద్ద దిక్కువ్. ఇంక మా అందర్కి

శుభవార్త

నాడీ ప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు



**డా॥ ఎస్. ఎస్. రావు,** M.B.H, R.M.P.

గారిని సంప్రదించండి.

**రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,**

చింతలబస్తి. 6-2-961. ఖైరతాబాద్.

హైదరాబాద్-500 004, (ప్రీమియర్ కేఫ్ సందులో)

శరీర బలహీనత. వూబగా పెరుగుటగాని. చిన్నప్పటినుండి సన్నముగా నుండి ఏ మందులవలన లావు కాకపోవుటగాని. అంగము వుండవలసిన సైజులో వుండకపోవుట. నరముల బలహీనత.మానసిక వ్యాధులు. పిట్సు. భయం. గుండెదడ. రక్తప్రసరణ ఎక్కువ కావటం లేక తక్కువగావడం. సర్వ విధములగు దగ్గులు. ఉబ్బసం. పొత్తికడుపు ఎత్తుగా పెరగడం. జలోదరం. కడుపు నొప్పి. గ్యాస్టిక్ ట్రబుల్స్. లివర్ జబ్బులు. కడుపులో గాలి చేరుట. స్త్రీల ముట్టుకుట్టు నొప్పి. కుసుమ వ్యాధి (ఏ రంగైనా సరే). మూత్రవ్యాధులు. మూలశంక. సుఖవ్యాధులు.స్త్రీలకుగాని. పురుషులకు గాని ఒకరిపై ఒకరికి విముఖత. పిల్లలు లేకపోవుట. వీపు నొప్పి. నడుము నొప్పి. కీళ్ళ వ్యాధులు. వాపు. నీరు చేరుట. చర్మవ్యాధులు. పుకడ్లు. ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట. బోదవాపు. జ్వరం. పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా పరిణమించినప్పుడుమాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

**సంప్రదించుకాలము : ఉదయం 7 గంటల నుండి సా॥ 5 గంటల వరకు.**
**పరీక్ష ఫీజు రు. 12/- చికిత్సకు అదనం.**

క్యాంపులు ప్రతి నెల : 5వ తేదీ : కర్నూలు. న్యూ ఉడిపి హోటల్. పెద్ద మార్కెట్ వద్ద. 6వ తేదీ : గుంతకల్. శ్రీలాడ్జి. 7వ తేదీ : కడప. ద్వారక లాడ్జి. 8వ తేదీ : తిరుపతి. భీమాస్ అనెక్స్ లాడ్జి. 9. 10 తేదీలు : మద్రాసు. కోమల విలాస్. నెం. 5 ప్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్ (జి. టి.) 11వ తేదీ : నెల్లూరు. రాఘవ విహార్. 12వ తేదీ : గుంటూరు. ఉడిపి శ్రీకృష్ణభవన్. స్టేషన్‌రోడ్డు. 13. 14 తేదీలు : వైజాగ్. బృందావన్‌లాడ్జి. డాబా గార్డెన్స్. 15. 16 తేదీలు : రాజమండ్రి. శాంతినివాస్ లాడ్జి. 17వ తేదీ ; కాకినాడ. విజయా లాడ్జి. (గవర్నమెంటు హాస్పిటల్ ఎదుట). 18. 19 తేదీలు : విజయవాడ. మోడరన్ కేఫ్. గాంధీనగర్. 20వ తేదీ ; వరంగల్ నటరాజ్ హోటల్. 21వ తేదీ నుండి హెడ్డాఫీసు.

SWASTIK

*దీపావళి బంపర్ ఆఫర్* ఎంట్రీ ఫీజు లేదు

1) సునైనా శ్రీవాత్సవ. జబల్‌పూర్ 2)ఎస్. వరలక్ష్మి. పిన్-534 101.

బహుమతులు : వాచ్. కెమెరా. టేపు రికార్డర్. రికార్డు ప్లేయర్. జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ (మా అభీష్టంపై ఏదో ఒక బహుమతి) కన్సొలేషన్ లేక మూడవ బహుమతి ; అమెరికన్ జార్జెట్ లేక ఆర్ట్ సిల్కు చీర ధర రు. 60/- ఇది అమ్మకం అభివృద్ధి పథకం. ప్రయోటర్ల తీర్మానం న్యాయమైనది మరియు చట్టబద్ధమైనది. మరియు అది ఈ పోటీకి స్పష్టమైన షరతు అయి వున్నది. నిబంధనలు : తెల్లకాగితముపై గడులను నమూనాలో వున్న విధంగా తయారుచేసి 14 నుండి 29 వరకు గల అంకెలను ఒకేసారి మాత్రమేవాడి ఎటు కూడినా మొత్తం 86 వచ్చునట్లు వేయాలి. 2. బహుమతి గెలచిన వారికి పోస్టేజి. ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. 3. ఒక కుటుంబం ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 4. మా కార్యాలయమునకు మొదటగా చేరిన ఎంట్రీకు ప్రత్యేక బహుమతి ఇవ్వబడును. 5. ఎంట్రీలు హిందే లేక ఇంగ్లీషులో మాత్రమే పంపాలి. వివాదములు ఆలీఘర్ జ్యూరీస్ డిక్షన్‌లో మాత్రమే పరిష్కరింపబడును.

| | | | |
|---|---|---|---|
| 19 | 24 | 17 | 22 |
| 28 | 13 | 26 | 15 |
| 21 | 20 | 23 | 18 |
| 14 | 25 | 16 | 27 |

సహాయమునకు 82

ఆఖరి పోస్టింగ్ తేది : 24-9-78

**ARVIND TEXTILES (AJWV.86) P.B. No. 88, Aligarh-202001.**

దేహోతవ్!!" అని ఖచ్చితంగా అంటూ వొంగి నరసమ్మ కాళ్ళకి దండం కూడా పెట్టింది.

కాబోలని మురిసిపోయింది నరసమ్మ. ఆ మురిపెంతో కొట్టు ఎట్లా ప్రారంభించాలో, కష్టమర్లనెట్లా ఆహ్వానించాలో, చేసిన వస్తువుల్లో ఉప్పెక్కువైనా, కారమెక్కువైనా వార్ని ఎట్లా సముదాయించి మరిపించాలో.... అన్నీ లచ్చిమికి ఉపదేశం చేసి పారేసింది.

అవన్నీ ఏకాగ్రతగా వింది లచ్చిమి. అట్లాగె - మిరపకాయల బజ్జీల్లో.. ఉప్పు.. శనగపిండి.. వగైరాలు ఏయే పాళ్ళలో కలపాలో, ఇంకా తదితర వాట్లల్లో ఏ విధంగా కలపాలో వివరంగా అడిగి తెల్సుకొంది.

ఇది జరిగి పది రోజులు కూడా కాలేదు- నరసమ్మ తన చేత్తో తన కన్నే పొడుచుకొన్నట్లుగా నెత్తీనోరూ బాదుకొంది.

అరకిలో శనగపిండితో ప్రారంభించిన లచ్చిమి మిరపకాయ బజ్జీల వ్యాపారం వారం రోజుల్లో ఊహించని విధంగా మార్పు చెందింది.

అంతవరకూ ఇంటి దగ్గరే అన్నీ చేసుకొచ్చి.. థియేటర్ కాంపౌండ్‌లో కూర్చునమ్మే లచ్చిమి నరసమ్మకి పోటీగా తనో మూకుడు పెట్టి అక్కడే గరమ్ గరమ్‌గా బజ్జీల తయారీ చేయసాగింది.

ఇంకా నరసమ్మ కొట్లోలేని పకోడీలు, మసాలా వడల్లాంటి కొత్త టిఫిన్సు కూడా తన కొట్లో ప్రవేశపెటింది లచ్చిమి.

నాల్గు రోజుల్లో.... నరసమ్మ దగ్గర కొచ్చే కష్టమర్స్ చాలావరకు తగ్గిపోయారు. తన ముగ్గురు పిల్లల్లో పెద్దాణ్ణి తన దగ్గరే చేతి క్రిందుంచుకొని చాయ్‌లు కూడా చేసి అందించసాగింది.

ఇవన్నిటినీ మించి, నరసమ్మని కళ్ళు తిరిగేలా చేసిన విషయమొకటుంది. అది లచ్చిమి మాటకారితనం!

అసలు నోట్లో నాలుకే లేదు. అమాయికపు ఆడకూతురని భావించిన లచ్చిమి - నరసమ్మ అంచనాలన్నీ తలక్రిందులు చేసి పారేసింది.

ఇప్పుడు —

లచ్చిమి నరసమ్మ కన్నా ఆప్యాయంగా కష్టమర్స్‌తో మాట్లాడ గల్గుతోంది. నరసమ్మ కన్నా అందంగా నవ్వగల్గుతుంది. ఇవన్నీ మించి లచ్చిమికి నరసమ్మలో లేనిది మరోటుంది. అదే మంచె, లచ్చిమి యవ్వనంలో వుంది. పైగా మిక్కిలి అందంగా సింగారించుకొని కొట్లో కూచుంటుంది.

లచ్చిమి నవ్వులో అమాయికత్వం

కాకుండా చిలిపితనం గంతులేస్తుంది. ఇప్పుడామె మిరప కాయబజ్జీల మూకుట్లో వాయిలేస్తూ పైట చెంగు నిర్లక్ష్యంగా వది లేయటం, అదోవిధంగా గారాలుపోతూ మాట్లాడ్డం నేర్చుకొంది.

ఇదంతా చూసి నరసమ్మ సహించలేక పోయింది. తన జాలితో తన దయాభిక్షతో ఇంత ఉన్నతికొచ్చి చివరికి తనకే పుట్ట గతుల్లేకుండా చేస్తుందా?

మండిపోతున్న ఆమె హృదయానికి ఆజ్యం తోడైనట్లుగా ఆ సాయంకాలం ఒక సంఘటన జరిగింది.

ప్రతి రోజూ సాయంత్రంపూట కొన్ని స్పెషల్‌గా చేసిన మిర్చీలు మేనేజరు బాబు కోసం ఆఫీసు లోకి పంపిస్తుంది నరసమ్మ. చాలా రోజుల్నుంచి జరుగుతున్న వ్యవ హారమది.

కాని ఆనాడు మాత్రం అలా కాకుండా-ఎప్పుడూ వొచ్చె గేటు కీపరు కుర్రాడు వెంకడు, తన కొట్టును దాటేసి తన దిక్కు చూడకుండానే పక్కనే వున్న లచ్చిమి కొట్టుకేసి వెళ్ళటం నరసమ్మ చూసి కించిత్తు ఆశ్చర్యపోయింది.

"ఎధవ పోరడు! పరధ్యానంల కొట్టు దాటుకుంట పోతండే....!!" అనుకొని-"ఒరేయ్! సన్నాసోడా! గటాడికిరా పోత న్నవ్ కొట్టు దాటేసి?" అని కేకేసింది.

వెంకడు ఆగి ఇటు చూశాడు.

"ఏందిరో! నడుసుకుంటనే నిద్ర పోతన్నవ్!" అంది నవ్వుతూ నరసమ్మ.

"కాదులేవమ్మ! నాది గంత నిద్ర మొకమేం గాదులే! కావాల్నానే పోతన్న లచ్చిమి కొట్టుకు-"

"రేయ్ ఇయ్యాళ్ళ బజ్జీలు గిట్ల తీస్క పోవుర మళ్ళ మేనేజరు బావ్‌కు-"

"మేనేజరు దొర నీకాదొద్దన్నడు. నువు కంపునూనెల గోలిత్తున్నవట కద! గందుక్కనే ఆయినె బాగ లెవ్వన్నడు."

"ఏందీ!" తెల్లబోయి నోరు తెర్చింది నరసమ్మ-"నేను కంపునూనెల గోలిత్త న్నాను? గీమాట మేనేజరు బాబన్నడా.... లేక నువ్వంటన్నవా ముదనష్టపు ఎధవా?"

"ఇగో నర్సొమ్మోయ్! నువు గట్ల తిట్టకు మల్ల! నీది కంపునూనె గాకపోతె మంచినూనేంది? గిదివరకు దొరన్నడుగని గిప్పుడు నేనంటన్న నీది గసోంటి నూనైపక్కనే దొర నీకానొద్దని లచ్చిమి కొట్ల దెమ్మన్నడు." అంటూ వాడు నిర్ల క్ష్యంగా తలెగురేసి వెళ్ళిపోయాడు.

* * *

నరసమ్మ చేష్టలు దక్కి చూస్తుండగనే ఇందాకటి కుర్రాడైన వెంకడు ఓ పేవరు


# BHARAT ENTERPRISES

(Regd No. 250/78)

FINANCE & SAVINGS

MIHIJAM-815354 (Bihar)

'బీహార్ గ్రూపు' లో మీ పేరు నమోదు చెయించుకోండి. మీరు చేయవల సిందల్లా ప్రతి నెల రూ. 25/- చొ॥న 20 నెలలు మాత్రమే చెల్లించాలి. మీకు ఒక నెంబరుగల పాస్ బుక్ పంపబడును. ఆ పాస్‌బుక్ మీకు 60 నెలలు స్కీము చివరవరకు ఉండును.

ప్రత్యేక ఆకర్షణలు :

1) ఋణ సౌకర్యం : ప్రతి సభ్యునకు రు. 5,000/ (ఐదువేలు) వరకు కంపెనీ ఋణం మంజూరు చేయును. "లోను" పొందుటకు ఎట్టి విధమైన సెక్యూరిటీలు అవసరంలేదు. సభ్యునిగా చేరిన వెంటనే ఋణం కొరకు అప్లికేషన్ పెట్టుకొనవచ్చును. లోను కొరకు పూర్తి వివరములు మెంబరు అయిన వారికి మాత్రమే పంపబడును.
2) మీరు చెల్లించు సొమ్మునకు పూర్తి సెంట్రల్ బ్యాంకు గ్యారంటీ గలదు.
3) మొత్తం బహుమతులు- రు. 38,40,000/-. మొత్తం సభ్యులు : 99,999. (ఇంకా ఎన్నో ప్రత్యేక ఆకర్షణలుగలవు)

మీ సభ్యత్వపు మొదటినెల సొమ్ము రు. 25/- సెంట్రల్ బ్యాంకు డ్రాఫ్టు/M. O./ I. P. O. ద్వారా నేడే పై అడ్రసునకు పంపండి.

మొదటి డ్రా 24-9-78న జరుగును.

మా క్రొత్త ఏజంట్లు : 1) శ్రీమతి డి. సూర్యకుమారి, Q. No. L/11/1. కంటా బంజి. (ఒరిస్సా) 2) శ్రీ బి. సుందరరావు, శేర్-ఏ-పంజాబ్-389 బి, లెమింగ్‌టన్ రోడ్డు, బొంబాయి-4. 3) శ్రీ పానుగంటి శ్రీకాంత్, పెద్దకురపాడు (జిల్లా) గుంటూరు. 4) శ్రీ కె. నారాయణగౌడ్, పి. యస్. బ్లాకు, కల్వకుర్తి, (జిల్లా) మహబూబ్‌నగర్. 5) వల్లమిల్లి శ్రీరామరెడ్డి, పరిషత్ హైస్కూలు, పామర్రు-533 305. 6) శ్రీమతి పి. సుందామని c/o డా॥ పి. శ్రీనివాసులు-రీజనల్ కేటల్ డెవలప్ యూనిట్-పెనుమూరు (జిల్లా) చిత్తూరు.






బ్రాంచీలు:- విశాఖపట్నం, అమలాపురం.

డిపోలు:- కాకినాడ, విజయనగరం.

రాజమండ్రి ఫోన్ : 2454, 2887. విశాఖపట్నం ఫోన్ : 2076.

SUBHA

అమ్మకమునకు సిద్ధంగా ఉన్నవి
ఇంగ్లీషు-తెలుగు మీడియం డిక్షనరి రు. 21/-
ఇంగ్లీషు-తెలుగు జెమ్ డిక్షనరి రు. 12/-
హిందీ-తెలుగు డిక్షనరి రు. 15/-
తెలుగు-తెలుగు డిక్షనరి రు. 30/-
పోస్టేజి అదనము.
బాలసరస్వతీ బుక్ డిపో,
మద్రాసు-1.
ఫోన్ : 29868

డా॥ పి.వి.కె.రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్

వైద్యవిద్వాన్-వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్ర స్కలనము-శుక్లనష్టము, సుఖ రోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.
రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700.

SUVARNA

డబ్బు కావాలా?
రు. 6/-లు పెట్టుబడితో మా చైను పద్ధతి) స్కీములో సభ్యులుగా చేరి మీ బంధు మిత్రులను చేర్పించడం ద్వారా ఇంట్లో కూర్చుని ప్రతీరోజూ పనియార్డర్ల ద్వారా రు. 17,476/-లు లాభం పొందండి.
SRI Vigneswara Money Circulation
Govt. Regd No 711,
Guindy Madras-32

ఉచితము! ఉచితము!
తెల్ల మచ్చలు
అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.
వివరాలు :
BHARAT AYURVEDASHRAM (M)
Post Katri Sarai (Gaya)

పొట్లంలో మిరపకాయ బజ్జీలు....లచ్చిమి కొట్లోవి, చుట్ట బెట్టుకొని వెళ్ళిపోయాడు.

చాలా సేపటికి కోలుకున్న నరసమ్మ లబోదిబోమంది. పిచ్చి పట్టినట్లుగా అరుస్తూ....కొట్లోంచి లేచి లచ్చిమి దగ్గర కొచ్చింది.

"ఎంత పజ్జేస్తివే దొంగ ముండ....! మేనేజరు బావ్‌కు మిర్చీలు వంపుతవ్‌లే..! నీ అవ్వ జాగీరున్నాదె దయ్యం మొకం దాన....? నీ కొంపల పీనుగెల్ల....నీ ఇంట్ల మన్నువడ..." కొద్ది రోజులుగా....తనలో పెరుగుతున్న కోపాన్నంతా .... వొచ్చి రావటంతోనే.. తిట్లద్వారా తీర్చుకోవటం మొదలెట్టింది.

అకారణమైన నరసమ్మ తిట్లకి .... లచ్చిమికూడా రెచ్చిపోయింది. ఒక్క ఉదుటున మూకుడు ముందు నుంచి లేచి నిలబడింది. నోట్లో నములుతున్న .... ఎర్రటి తమలపాకును తుప్పున ఊసి — "ఏందే ముసలి ముండా....!

నా కొట్టు ముందటికొచ్చి వాగుతున్నవ్....!" అంది గొంతుస్థాయి హెచ్చించి.

"ఏం కూస్తివే....! నన్ను ముసలి ముండంటవులే!! గంత ధయిర్యమొచ్చినాది....? గంత నీలుడెక్కినాది....?"

"ధైర్యంగాక ఏందట....? నువ్వేం పెద్దపులివా మింగెతందుకు..? అసలెవతివే నువ్.... ఇక్కడొచ్చి లొల్లి వెడ్తున్నవ్..? ఫో....ముందు—"

"అంటవే....బేగర్ల దానా....! ఇమానం లేని పీనుగ.. కాదుకెత్తుకెల్లంగేమో జేసిందట. గానాడు....ఏడ్సుకుంట .... మొత్తుకుంట వొచ్చి కాళ్ళ మీద వడ్డనాడు.... గీ నీల్గుడెక్కడున్నదే? మేనేజరు బావ్‌ను బతిమాలి .... కొట్టుకు పర్మిసనిప్పిత్తే.... సివారికా బావ్‌నే బుట్టలేసుక్కుంటవులేదే.. బజారు ముండా...."

"ఇగో నర్సమ్మా..! మంచి మాటల్లోని జెప్తన్న .... గట్ట తిట్టకుమల్ల .... నాకు శివ మెత్తిందంటెనా."

"ఏం జేస్తవే! శిగమెత్తితె పొయి శివ సత్తులల్ల గల్సి వూరేగు. గంతవేగాని నాది కంపునూనె అని పశారం జేసుకుంట నా గిరాకిని మల్పుకుంటావు? శివారికి మేనేజరు బావుకూడ నాది కంపునూనెని జెప్పతవ్ లేదే సైతాన్ ముండ."

లచ్చిమి బాగా రెచ్చిపోయింది. ఆమె పూర్తిగా కొట్టు బయటకొచ్చి నిలబడింది యుద్ధానికి సిద్ధపడుతున్న దానిలా. లచ్చిమి కొట్లో చాలా మందున్నారు. ఇంకా కంపోండులో సినిమా చూట్టానికొచ్చిన వాళ్ళూ బయట దారమ్మట పోతున్నవాళ్ళూ అంతా నిలబడి చోద్యం చూడసాగారు.

"అవ్‌నే! నీది మొమ్మాటికి కంపునూనెగా నూనెల గోలిచ్చిన కంపు బజ్జీ లెవడు తింటడే? ఈ ఇసయం మేనేజరు బావ్‌కూడ జెప్పిన! ఏం జేసుక్కుంటవో జేస్కపోయే ముసలి దొక్కూ!"

"ఏందే, ముసలి దొక్కునా? అవ్‌నే నీ లెక్క లంజె బుద్ధులెవడికుంటయ్‌మరి? నీ శీరె గట్టుడూ నీ తమలపాకులు నవులుడూ రొమ్ములు గనబడంగ కష్టోమర్స్‌తోని సరసమాడుడు గివన్ని యేందట? లంజా! మొమ్మాటికి నువు లంజెవేనే"

"ఏం కూసినవ్ గుమ్మడిపండూ," మితి మీరిన కోపంతో ముందుకిదూకి నరసమ్మతో కలియబడింది లచ్చిమి. బలమంతా ఉపయోగించి ఒక్కనెట్టు నెట్టింది.

ఆ తోపుకి నరసమ్మ స్థూలకాయం దభీమని నేలమీద కూలబడింది. నరసమ్మ నడుం కలుక్కుమంది ఒక్కసారిగా. వెంటనే లేవాలంటే చేతకాలేదు. అసహాయతతో పాటు అందరూ నవ్వుతుంటే ఏడుపుకూడా ముంచుకొచ్చింది.

"నన్ను నూకేస్తవు లేదే సువ్వార్ దానా! నీ శేతులు పడిపోను. నీ ఇంట్ల పీనుగెళ్ళ! వొయసులున్నవ్ గదాని గింత బరిదెగిస్తావు? నీ వొయసు కాలిపోను" తిట్ల దండకం సాగిస్తూనే మెల్లగా లేచి నిలబడింది.

లేచి లేవటంతోనే ఒక్క ఉదుటున లచ్చిమి జుట్టు పట్టుకొని అటూ, యిటూ కసిగా వూపి పారేసింది.

లచ్చిమి కూడా నరసమ్మ తల వెంట్రుకల్ని చేతికి దొరక బుచ్చుకొంది. ఇరువురూ పగబూనిన శత్రువుల్లా గింజుకొంటున్నారు, కొట్టుకొంటున్నారు.

ఒకర్నొకరు కసిగా రక్కుకొంటున్నారు. ఒక ప్రక్క వెంట్రుకలూడిపోయేలాగు లాగుకొంటూ మరో ప్రక్క తిట్ల వర్షం కురిపిస్తున్నారొకరిమీద మరొకరు. ఇరువురూ క్రింద నేల మీద పడ్డారు. అయినా పట్టు వొదలకుండా అట్లాగే దొర్లుతున్నారు. ఇంతలో వారి మధ్యకు వెంకడు పరిగెత్తుకొచ్చాడు. నిలబడి ఈలలు వేస్తూ చోద్యం చూస్తున్న వాళ్ళందరితో "గిదేం దయ్యా! నిల్సుండి సినిమా సూస్తున్నారు? ఇద్దర్నీ చెరో దిక్కుకూ గుంజి పారెయ్యక" అంటూ తను ఇరువురి మధ్యకెళ్ళి నరసమ్మనూ, లచ్చిమినీ విడిపించబోయాడు.

"ఒరేయ్ కుర్రవెధవా! నడిమిట్ల కొచ్చినవంటే సంపిపారేస్తాను. ఇయ్యాళ

దీని సంగతి తేల్చేత్తాను. దొంగలంజె ఏసాలేసి మందిని ముంచుద్ది.... ఫూ!"- నరసమ్మ వెంకణ్ణి దూరంగా తోసేస్తూ లచ్చిమి వీపులో బలంగా పిడిగుద్దులు వేయ సాగింది.

వెంకడు లచ్చిమినికూడా విడిపించ బోయి దూరంగా నెట్టివేయబడ్డాడు. చుట్టూ వున్న జనమంతా నవ్వటంతో వెంకడికి రోషం ముంచుకొచ్చింది. లేచి నిలబడి- "సావుంద్రి ముండల్లారా! వొళ్ళు కొవ్వెక్కింది మీకు. బజార్లవోర్లాడు తంటే సిగ్గు శరమనిపిస్తలేదు. ఛూ మీరు ఆడోళ్ళు కాదు. ఇద్దరిద్దరే సువ్వర్ ముండలు సావుండి! బాగ గొట్టుకొని సావుంద్రి" అని అరిచి చక్కా లోపలకు పోయాడు వాడు.

వెంకడొచ్చి చెప్పగానే మేనేజరు పరమేశ్వరయ్య బయటకొచ్చాడు. అంతదాకా ఎక్కడున్నాడో తెలీదు కాని, రాజు వెంట భటుని లాగు ఎక్కణ్ణుంచో ఓ పోలీసూడి పడ్డాడు.

అతను ఇరువుర్నీ విడిపించబోయి సాధ్యపడక చేతిలో వున్న లాఠీతో చెరో దెబ్బవేసి ఎలాగైతేనేం కష్టంగా విడదీసి ఉసూరుమన్నాడు.

లచ్చిమీ, నరసమ్మా ఒకరి కొకరు ఎదురెదురుగా రెండు ఆడపులుల్లాగు నిలబడ్డారు.

"ఇదిగో చెప్తన్నా! మీ రిద్దరూ శాంతంగా సక్రమంగా వుంటేతప్ప ఇక్కడ కొట్లు తెరుచుకోటానికి వీలుండదు. మళ్ళీ ఇట్లాంటి కొట్లాట ఇకముందు జరిగిందా ఇరువురి వస్తువులూ బయట పారేయించి మిమ్మల్ని పోలీసుకొట్లో తోయించేస్తాను. జాగ్రత్త!!" వారిద్దరి నుద్దేశించీ అని లోపలకు పోయాడు పరమేశ్వరయ్య.

"దొమ్మరి ముండా! గింతటితోని అయిపోయిందనుకుంటన్నవేమో! నిన్నూ నీ కొట్టునూ తీసి బయటేయించకుపోతె నాపేరు నరసమ్మేకాదు ఆఁ" అని శపథం చేసింది నరసమ్మ వూడిపోయిన వెంట్రుకల్ని ముడేసికొంటూ.

లచ్చిమికివొళ్ళంతాకురక్కుపోయింది. అక్కడక్కడా గాట్లుకూడా పడినాయ్. ఆ గాట్లకేసి జాలిగా చూస్తూ" "ముసలి ముండకు పండ్లు గట్టిగనే వున్నయ్. దీన్ని బొందపెట్ట" కోపంగా అన్నాడు లచ్చిమి కొడుకు.

"పండ్లే కాదురా, దీనిమీద మన్నువడ వొళ్ళు సూడు ఏనుగు లెక్క ఎట్ల బల్సిందో! గొడ్రాలి బతుక్కు సంపాయించినంత వొళ్ళు పెంచుడుకేనాయె. థూ! ఎందుకు గా శెత్త పాడుగాను" అసహ్యంగా చూసి నేలమీద ఉమ్మేస్తూ.... లచ్చిమి.



"ఓ బొజ్జ గణపయ్య—"

చిత్రం : టి.వి.యన్. మూర్తి, తెనాలి-1

"అవునే! గొడ్డుదాన్నే.... నీ లెక్క మొగుణ్ణిడిసి పెట్టి జనానికి మరగ లేదే నేనూ! అది సాలకుంట శివారికి మేనేజరు బావుకూడ మరిగనవ్ గాదె. థూ థూ! నీది ఓ బత్కేనాంట? బజారు లంజ...."

"వాగుడుదాన! నీ తోటెవడు అరుస్తడె? రేపీయాళకు నువ్వెక్కడుంటవోలే....!"

"నువ్వా, నేనో సూత్తాంలే! నీకెవడడ్డమొస్తడో! కొట్టు పీకిపియ్యక పోతనా? నువు మళ్ళ బిచ్చమెత్తక పోతవా!" కొట్టునెక్కడి కక్కడ సర్దుకొని- కాంపోండు దాటుతూ అంది నరసమ్మ.

"నిన్ను నేనిడ్సిపెడ్తాను? తన్ని తగిలేపిస్తనే గుమ్మడిపండూ! అవుతల రోడ్లూడుసుకుంట బత్కాలె సూడు...." తనూ శపథం చేసింది లచ్చిమి.

*     *     *

మర్నాడు—

థియేటర్లో కొత్త సినిమా వేశారు.

మ్యాట్నీ వేళకే అందరూ టాకీసు ఆవరణలో గుమిగూడుతున్నారు.

సమయం మూడు గంటలు కాకముందే ఆనాడు సినిమా మొదలెట్టడానికి చాలినంత మంది జనం పోగయ్యారు.

నరసమ్మ మెల్లగా నడుస్తూ గేటు దగ్గర కొచ్చింది థియేటర్‌కి కుడి పక్కనుంచి.

ఆమె వెనక ఇద్దరు వస్తాదుల్లాంటి మనుషులు! నోట్లో చుట్టలతో ఎక్కుపెట్టిన మీసాలతో: వారిరువురి చేతుల్లోనూ బలమైన కర్రలున్నాయ్.

ఇంతలో - మరోవేపు నుంచి లచ్చిమి హడావిడిగా వొచ్చింది. వస్తూనే అక్కడ నిలబడున్న నరసమ్మ కేసి తీక్షణంగా చూసింది.

లచ్చిమి వెనకాల నల్గురు యువకులు- నరసమ్మ వార్ని పోల్చుకొంది. నల్గురూ స్టూడెంటు కుర్రాళ్ళే! అందులో ఇద్దరి చేతుల్లో మడిచిన సైకిలు చైన్లు!!

నరసమ్మా లచ్చిమీ ఒకర్నొకరు తీవ్రంగా చూసుకొన్నారు. అప్పటికే పక్కన ఒకరిద్దరు ఇదేదో గలాటా జరుగబోతోందని గ్రహించి ప్రక్కకి తొలగిపోతున్నారు.

నరసమ్మ ఓసారి యథాలాపంగా థియేటర్ కంపోండులోకి తొంగి చూసింది.

చూసి చూడటంతోనే పిడుగు పడినట్లుగా అదిరిపడింది. ఏదో భూతాన్ని చూసినట్లుగా గుడ్లు వెళ్ళబెట్టింది.

తనూ అటుకేసి చూసిన లచ్చిమి స్థితి కూడా ఇంచుమించు అంతే అయింది.

ఓ నిమిషంపాటు, లచ్చిమీ నరసమ్మా కంపోండులోకి తమ మొహాలకేసీ చూపులు తిప్పుకొన్నారు. ఇరువురి మొహాలు పాలిపోయినయ్.

లోపల-

అంతవరకూ గేటు కీపరుగా పన్చేస్తూండిన వెంకడు. నరసమ్మా లచ్చిమీ కొట్లు పెట్టుకున్న చోటును ఆక్రమణం చేశాడు. ఎంచక్కా తడికలు వగైరాలు కట్టి, బెంచీలు.... టేబుల్స్ వగైరాలువేసి అక్కడో హోటల్ చేసిపారేశాడు.

అందులో ఒక పక్క మిరపకాయ బజ్జీలు, వడలు, ఇంకా పకోడీ తదితర కారం వస్తువులు జనాన్ని ఆకర్షించేలా అమర్చిపెట్టాడు. మరో పక్కన అద్దాల్లో మిఠాయిలు.

ఇద్దరు పోలిసాళ్ళు ఛాయ్‌లు తాగుతూ బెంచీమీద కూర్చొనున్నారు.

ప్రత్యేకంగా ఓ కుర్చీలో కూర్చొని తన కిష్టమైనవి గరమ్ గరమ్‌గా తెప్పించుకొని తింటున్నాడు మేనేజరు బాబు.

వెంకడు నవ్వుతూ ఆయనతో మాట్లాడుతున్న వాడల్లా గేటుకేసి చూశాడు,

అంతే—

గబుక్కున తల లొంచుకొని లచ్చిమి ఒకవైపూ, నరసమ్మ మరో వైపూ వెను దిరిగి చీలిపోయారు.